క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులు

కమలాపూర్ : నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు స్థానిక తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.అనిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్‌లో చదువుతున్న ఒద్దిరాల శ్రీకాంత్, దాసి మోక్షిత్, సులగూరి రాహుల్, గుర్రం స్నేహిత్ ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పొందుతారని తెలిపారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మెల్యేను కలిసిన రెడ్డి సంఘం సభ్యులు



ధర్మసాగర్ : మండల కేంద్రానికి చెందిన రెడ్డి సంఘం సభ్యులు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హనుమకొండలోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఈ నెల 8న రెడ్డి సంఘం భవన నిర్మాణ భూమి పూజకు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంఘ భవన నిర్మాణానికి తన సీడీఎఫ్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రెడ్డి సంఘం పాలకవర్గం, అభివృద్ధి కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి భూమి పూజ



ధర్మసాగర్: స్థానిక బీరప్ప గుడి నిర్మాణం భూమి పూజ కార్యక్రమానికి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య దేవాలయ నిర్మాణానికి భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం మండలంలోని ముప్పారం గ్రామంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొని ఎల్లమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎల్లమ్మ తల్లి చల్లని దీవెనలు గ్రామస్తులందరిపై ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమాల్లో యాదవ, గౌడ సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి లబ్ధిదారులను 'ఇందిరమ్మ ఇళ్ల'లో చేర్చాలి

ఆత్మకూరు : పరకాల నియోజకవర్గంలో గృహలక్ష్మి లబ్ధిదారులను ఇందిరమ్మ ఇళ్ల పథకంలో చేర్చాలని అమెరికా పర్యటనలో ఉన్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వం అసలైన లబ్ధిదారులకు 3 వేల ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇందిరమ్మ పథకంలో గృహలక్ష్మి లబ్ధిదారులను చేర్చకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని ఇప్పటికైనా వీరిని గృహలక్ష్మి పథకంలో చేర్చాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో లబ్ధిదారులతో కలిసి ధర్నాలు చేపడతామని అన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కమలాపూర్ : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి కేస్ వర్కర్లు భారతి, కరుణ సూచించారు. మండలంలోని శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సఖి వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా గృహహింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలు వంటి వాటి నుంచి రక్షణ పొందేందుకు సఖి సెంటర్ పని చేస్తుందన్నారు. మహిళలు సమస్యల్లో ఉన్నప్పుడు మహిళా హెల్ప్‌లైన్ నంబరు 181, చైల్డ్‌లైన్ నంబర్ 1098కు, 08702452112, 7382983088 నంబర్లకు కాల్ చేయడం ద్వారా తక్షణ సాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో సంపూర్ణ, మంజుల, రాజ్యలక్ష్మి, సుమత, సరిత, స్వశక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఆత్మకూరు(దామెర) : ఆరోగ్యం సహకరించకపోవడంతో ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన దామెర మండలంలోని ఊరుగొండలో శుక్రవారం చోటు చేసుకుంది. దామెర ఎస్ఐ అశోక్ కథనం ప్రకారం..ఊరుగొండకు చెందిన గుడిపాటి జనార్దన్‌రెడ్డి (94) ఆరోగ్యం సహకరించకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంటి ఆవరణలో ఉన్న చేదబావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు రత్నాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఖరీఫ్‌కు రైతులు సన్నద్ధం

- మండల పరిధిలో 17వేల ఎకరాల్లో పంట సాగు
- ముందస్తు వర్షాలతో వ్యవసాయ పనులు



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు



పత్తి గింజల కోసం అచ్చు తోలుతున్న రైతు

నడికూడ : గత ఏడాదితో పోల్చుకుంటే ఈసారి నైరుతి రుతుపవనాలు తొలకరి వానజల్లు 20 రోజుల ముందుగానే రావడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తూ వ్యవసాయ పనులకు సన్నద్ధ మవుతున్నారు. ఖరీఫ్‌కు మండల పరిధిలో ప్రధానంగా వరి, మిర్చి, పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తారు.వర్షాల త్వరాత ప్రధానంగా మండలంలోని చాలా వరకు చెరువులు, కుంటలు, బోర్, బావుల ద్వారా వ్యవసాయం సాగు చేస్తారు. మండల కేంద్రంలోని మహ్మద్ షానాల మాటు వాగు ద్వారా నడికూడ నుంచి వెంకటేశ్వరపల్లి వరకు సుమారు 600 ఎకరాల్లో వరి సాగు చేస్తారు. మండల వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం మండలంలోని గ్రామాల్లో వరి 8 వేల ఎకరాల్లో, పత్తి 7550, మిర్చి 2500, మొక్కజొన్న 100 ఎకరాల్లో రైతులు పంట సాగుచేసే అవకాశం ఉంది. మండలంలోని నార్లాపూర్‌లో అత్యధికంగా వరిసాగు చేస్తారు. చాలా వరకు రైతులు వ్యవసాయ పనులకు యంత్రాలను వినియోగించినా, కూలీల కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్రతీసారి పలు గ్రామాల నుంచి కూలీల వలస కొనసాగుతోంది. కూలీల కొరత వలన పెట్టుబడి ఖర్చులు పెరిగే అవకాశం ఉందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక దిగుబడులు సాధించేందుకు సన్నద్ధమవుతున్న వేళ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్న రైతు భరోసా రాకపోవడం, కూలీల కొరత, ఎరువులతో పెట్టుబడి ఖర్చులు పెరిగే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూలీలు దొరకడం లేదు



వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడడంతో అదనంగా కూలీ డబ్బులు ఇస్తామన్నా కూలీలు దొరకడం లేదు. దీంతో మాకు పెట్టుబడి ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. – సాంబశివరెడ్డి, రైతు,కంఠాత్మకూర్

రశీదు భద్రపర్చుకోవాలి



రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో విత్తన ప్యాకెట్‌పై తయారీ తేదీ చూసు కోవాలి.పంటకాలం పూర్తయ్యేంత వరకు రశీదు తప్పకుండా భద్రపర్చుకోవాలి. – పోరిక జైసింగ్, ఏఓ

రైతు భరోసా విడుదల చేయాలి



ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతులు రైతు భరోసా కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. సీఎం స్పందించాలి. – కిషన్ రావు (రైతురక్షణ సమితి సంఘం నాయకుడు, నర్సక్కపల్లె)

'భూ భారతి'తో సమస్యలు పరిష్కారం



ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసి పనులు ప్రారంభిస్తున్న ఝాన్సీరాణి



పరకాల : రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి

కమలాపూర్ : భూ భారతితో భూ సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతాయని ఏఎంసీ చైర్ పర్సన్ తొటం ఝాన్సీరవీందర్ అన్నారు. మండలంలోని గుండేడు, నేరెళ్ల గ్రామాల్లో శుక్రవారం భూ భారతి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యలకు సంబంధించి గుండేడులో 57, నేరెళ్లలో 149 దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఏఎంసీ చైర్ పర్సన్ ఝాన్సీరాణి గుండేడులో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య, తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్, డీటీ శోభారాణి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 126 అర్జీలు

పరకాల : మండలంలోని పైడిపల్లి గ్రామంలో జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సులో 126 అర్జీలను రెవెన్యూ అధికారులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అర్జీలను పరిశీలించిన అనంతరం తహసీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో పెట్టుకున్న అర్జీలను త్వరగానే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్ట్స్ బహూకరణ



టీషర్ట్స్ అందుకున్న విద్యార్థులతో ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు: సాఫ్ట్‌బాల్ ఆడుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయుడు చిదురాల శ్రీనివాస్ టీషర్ట్స్ బహూకరించారు. సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు సమావేశం శుక్రవారం మండలంలోని ఒంటిమామిడిపల్లి స్కూల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్సై పస్తం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల ఆవశ్యకతను వివరించారు. అనంతరం విద్యార్థులకు టీషర్ట్స్ అందజేశారు. కార్యక్రమంలో పీఈటీ నాగరాజు, రామప్ప జూనియర్ కాలేజ్ అధ్యాపకుడు శ్రీనివాస్, ఏఏపీసీ చైర్మన్ సకీనాబీ, పాఠశాల అడ్వైజర్ మహ్మద్ రఫీ, అమరవాది రవి పాల్గొన్నారు.

పరామర్శ

ఆత్మకూరు(దామెర): మండలకేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కిన్నెర సమ్మక్క కుటుంబాన్ని మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి దండు చిరంజీవి పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఈసందర్భంగా దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ బంధువులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అండగా ఉంటామన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేస్తాం



మాట్లాడుతున్న బీజేపీ నేత కాళీప్రసాద్‌రావు

పరకాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ స్పష్టం చేశారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన బీజేపీ పట్టణ నూతన కార్యవర్గ సమావేశానికి పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ అధ్యక్షతన వహించగా వారు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించి కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. రాబోయే రోజుల్లో బీజేపీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపై ఉందన్నారు. కాంగ్రెస్ చేస్తున్న మోసపూరిత విధానాలను ఎండగడుతూ ప్రజలలోకి బలంగా వెళ్లడం ద్వారా స్థానిక ఎన్నికలలో ఖచ్చితంగా విజయం సాధించడం ఖాయమన్నారు. పరకాల అభివృద్ధి ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ద్వారా సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు గురుప్రసాద్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు మేఘనాథ్, మాజీ కౌన్సిలర్స్ ఆర్పీ జయంత్‌లాల్, పూర్ణచారి, పట్టణ నాయకులు పురుషోత్తం, రంజిత్, తిరుపతి, రవి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

- మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్



మందులు అందజేస్తున్న పరకాల మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్

పరకాల: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఆరోగ్యంపై ప్రజలు, ముఖ్యంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు అప్రమత్తంగా ఉండాలని పరకాల మున్సిపల్ కమిషనర్ సి.హెచ్ వెంకటేష్ కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో ఉచిత వైద్యశిబిరం ద్వారా ఉద్యోగులకు, పారిశుద్ధ్య సిబ్బంది, మహిళ స్వయం సహాయక గ్రూపులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల కాలం కారణంగా పట్టణంలో చెత్తచెదారం పేరుకపోకుండా సిబ్బంది పనిచేయాలని సూచించారు. అప్పుడే ఆరోగ్యవంతమైన పట్టణాన్ని తయారుచేసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి దివ్యతో పాటు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం



ఫైర్ ఇంజను, జేసీబీ సహాయంతో మంటలను ఆర్పుతున్న సిబ్బంది

ఐనవోలు : గడ్డివాము దగ్ధమైన సంఘటన మండలంలోని కక్కిరాలపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో పరదాలతో క ప్పి ఉన్న గడ్డివాము నుంచి పొగ వస్తుండటంతో గమనించిన ఓ వ్యక్తి చుట్టు పక్కన ఉన్న యువకులు, రైతులు, యజమానికి సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న వారు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అలాగే వర్ధన్నపేట ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్‌తో పాటు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైర్ ఇంజన్ నుంచి సుమారు 50 శాతం నీరు లీకై వృథాగా పోతుండటంతో వరంగల్ మట్టెవాడ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించి పోలీసులు మరో ఫైర్ ఇంజన్‌ను పిలిపించారు. ఈ గడ్డివాము ప్రక్కనే మరో గడ్డి వాము ఉండటం.. చుట్టు ప్రక్కల ఇళ్లతో పాటు విద్యుత్ లైన్‌కు సమీపంలో ఉండటంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత



వేలేరులో ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వేలేరు/ధర్మసాగర్ : అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు వస్తుందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం వేలేరు, ధర్మసాగర్ మండల కేంద్రాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్ రూం ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తుందని అన్నారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకు అతీతంగా, అత్యంత పారదర్శకంగా జరిగిందని అన్నారు. మొదటి విడతలో ఇళ్లు రాని వారు అధైర్యపడవద్దని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్లు ఇచ్చే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఇళ్ల బిల్లుల విషయంలో ఎవరికి ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వాల్సిన పని లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే నా దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండలంలోని శాలపల్లిలో పైలట్ గ్రామంలో 79 ఇండ్లు మంజూరు కాగా, మిగతా గ్రామాలకు 196 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ కోమి, హౌసింగ్ డీఈ చైతన్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మనలో మనకే తగాదాలు వద్దు..

ప్రతీ గ్రామంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేయాలని కొత్త, పాత అనే విషయాలు మర్చిపోవాలని, మనలో మనకే తగాదాలు ఉంటే పార్టీ నష్టపోతుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. వేలేరు, ధర్మసాగర్ మండలాల్లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ పరిశీలకులు కోటంరెడ్డి వినయ్ రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడుతూ పార్టీలో కొంతమందిని ఎంత కలుపుకుపోవాలని చూసిన వారు కలిసి రావడం లేదన్నారు. ఇప్పటికైనా బేదాభిప్రాయాలు పక్కన పెట్టి పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి సంపత్, నాయకులు బిల్లా యాదగిరి, మల్లికార్జున్, రాంగోపాల్ రెడ్డి, సద్దాం హుస్సేన్, ప్రమోద్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్, రాజిరెడ్డి, రవీందర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులను సకాలంలో పూర్తిచేయాలి

- అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాసరావు

ఆత్మకూరు : గ్రామాల్లో ఈజీఎస్ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఈ దిశలో ప్రణాళికలు చేయాలని అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. మండపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆత్మకూరు, దామెర మండలాల ఏపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్లాంటేషన్ స్థలాల గుర్తింపు చేపట్టాలన్నారు. ఇంకుడు గుంతలు, సోక్ పిట్స్ పనులు వేగవంతం చేయాలన్నారు. ఉపాధి కూలీలకు రూ.307 వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీలలో మొక్కలను సంరక్షించాలని అన్నారు.ప నుల్లో నిర్లక్ష్యం వహించొద్దని అన్నారు. జాబ్‌కార్డులు, మస్టర్ మెయింటెనెన్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, దామెర ఎంపీడీఓ కల్పన, ఏపీఓలు రాజిరెడ్డి, శారద, ఈసీలు రాము, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు నేలసారాన్ని కాపాడుకోవాలి

- ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జె.సాయికిరణ్



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ సాయికిరణ్

పరకాల: రైతులు ఒకే పంట బదులుగా వివిధ రకాల పంటలను సాగు చేయడం ద్వారా నేలసారాన్ని కాపాడుకోవచ్చని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జె.సాయికిరణ్ సూచించారు. భారత వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు పట్టణంలోని రైతు వేదికలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సాయికిరణ్ పాడిపశువులకు సంబంధించిన ప్రణాళికతో పాటు సలహాలు, సూచనలు ఇచ్చారు. సస్యరక్షణకు ట్రైకోడెర్మా వంటి జీవ నియంత్రిక కారకాలను వినియోగించడం ద్వారా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించినట్లు అవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఇండోరియా, డాక్టర్ సాయికిరణ్, సాయిచంద్, ఏఈఓ శైలజ, రజాక్,అనిల్, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

సాక్షి,నెట్‌వర్క్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని ఎల్కతుర్తి, ఆత్మకూరు,కమలాపూర్, ఐనవోలు ఎంఈఓలు సత్యనారాయణ, విజయ్‌కుమార్, శ్రీధర్, ఆనందం అన్నారు. శుక్రవారం జిల్లాలోని ఆయా గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన జరుగుందని ఆయన తెలిపారు. కార్పొరేట్‌కు ధీటుగా అన్నిరకాల వసతులు సదుపాయలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడికి వస్తే బహుమతి ఇస్తాం

నడికూడ : మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ ఈ విద్యా సంవత్సరం కొత్తగా ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులకు బడికి వస్తే బహుమతి ఇస్తాం అని తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని ఎంపీడీఓ విమల, ఎంఈఓ హనుమంతరావు ఆవిష్కరించారు.



ఎల్కతుర్తి : తిమ్మాపూర్‌లో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ, ఉపాధ్యాయులు



ఆత్మకూరు : అక్కంపేటలో బడిబాటలో..



ఐనవోలు : మాట్లాడుతున్న ఎంఈఓ ఆనందం



కమలాపూర్ : మాట్లాడుతున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనిత



నడికూడ : బడికి వస్తే బహుమతి ఇస్తాం కరపత్రాన్ని, ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ విమల, ఎంఈఓ



వేలేరు: పీచర పాఠశాలలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ కోమి

వికసిత్ భారత్ లక్ష్యంగా బీజేపీ కృషి



జెండావిష్కరిస్తున్న బీజేపీ నేతలు

శాయంపేట : వికసిత్ భారత్ లక్ష్యంగా బీజేపీ కృషి చేస్తుందని బీజేపీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నే మొగిలి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన మండల నూతన కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా మొగిలి పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు పూర్తవుతుందన్నారు. దేశం 2047 నాటికి పూర్తిగా వికసిత్ దేశంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా భారతదేశ స్థానం మరింత శక్తివంతంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం బీజేపీ జెండాను ఆయన ఎగరవేశారు. రాజు, నాగరాజు, శివ, రాజశేఖర్, విజయ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.